# జ్ఞాన వైభవం - 1

## నిశ్చయజ్ఞానం



సద్గురు శ్రీనాన్నగారు

# జ్ఞాన వైభవం 1

## నిశ్చయజ్ఞానం

కె. వి. రమణ

ప్రకాశకులు:
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు

# జ్ఞానవైభవం 1

ప్రధమ ముద్రణ: మార్చి, 2021
ప్రతులు: 500
హక్కులు: ప్రకాశకులవి

ప్రకాశకులు:
శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు

ప్రతులకు:
శ్రీరమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265, పశ్చిమ గోదావరి జిల్లా
ఫోన్: 9848523805

గ్రాఫిక్స్:
శ్రీ గాయత్రీదేవి గ్రాఫిక్స్,
గాంధీనగర్, విజయవాడ - 520 003
ఫోన్: 9440636178

ముద్రణ:
శ్రీరమణ ప్రింటర్స్,
స్వామి వీధి, గాంధీనగర్, విజయవాడ - 520 003
ఫోన్: 9985068630

# గురు ధ్యానం

**దక్షిణామూర్తి సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్ ॥**

దక్షిణామూర్తితో ఆరంభమై, శ్రీశంకరాచార్యులవారు మధ్యములుగా, ప్రస్థుతం ఉపదేశం ఇచ్చిన సద్గురు శ్రీనాన్నగారు వరకు గల గురుపరంపరకు నమస్కరిస్తున్నాను.

**గురుః బ్రహ్మా గురుః విష్ణుః గురుః దేవో మహేశ్వరః ।**
**గురుః ఏవ పరం బ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥**

గురువు బ్రహ్మా, గురువు విష్ణువు, గురువు మహేశ్వరుడు, గురువే పరబ్రహ్మము. అట్టి శ్రీ గురువుకు నమస్కరిస్తున్నాను.

# విషయసూచిక


(1) గురువుగారిని ఎలా గౌరవించుకోవాలి? 5

(2) భగవంతుని న్యాయం 7

(3) ఆత్మజ్ఞానం 13

(4) గీతా రహస్యం 18

(5) గురూపదేశం 21

అష్టావక్రగీత - నిశ్చయజ్ఞానం 24

## (1) గురువుగారిని ఎలా గౌరవించుకోవాలి?

భక్తుడు: మిమ్ముల్ని గౌరవించుకోవాలి అని ఉంది.
దయచేసి ఎలా గౌరవించుకోవాలో చెప్పండి.

**శ్రీనాన్నగారు:**

నేను ఏ హృదయంలోనుంచైతే వాక్యం చెబుతున్నానో, ఆ హృదయంతో వాక్యాన్ని గ్రహించండి. అదే మీరు నాకు చేసే గౌరవం.

ఆ హృదయంతో మీరు వాక్యాన్ని గ్రహిస్తే, ఆచరణ సహజం అవుతుంది.

♦♦♦

వారికి నిజమైన గౌరవం ఎలా ఇవ్వాలో సద్గురు శ్రీనాన్నగారు చెప్పిన ఈ అమూల్యమైన మాటలను జాగ్రత్తగా మననం చేసుకుందాం.

చెప్పడం, గ్రహించడం అనేవి సాధారణంగా ఇంద్రియాలు, మనస్సుతో జరుగుతాయి.

శ్రీనాన్నగారి మనస్సు నిర్మలం అవ్వడంవలన వారు హృదయంలో నుండి వాక్యం చెప్పారు అంటే జ్ఞానబోధ చేశారు.

భక్తులు ఆ వాక్యాన్ని (జ్ఞానబోధను) హృదయంతో గ్రహించాలి అంటే, ముందుగా వారి మనస్సు నిర్మలం కావాలి.

మనస్సు నిర్మలం కావాలి అంటే రాగద్వేషాలు అనేవి లేకుండా ఉండాలి. నేను, నాది అనే అహంకారం, మమకారం లేకుండా ఉండాలి.

అలా జరగాలంటే, నిరంతరం సత్సంగం చేయాలి అంటే గురుపరంపర జ్ఞానబోధను నిరంతరం శ్రవణం, మననం, నిదిధ్యాసనం చేయాలి. ప్రయత్నపూర్వకంగా ఆచరించడమనే సాధన చేయాలి.

మనస్సు నిర్మలం అవుతుంటే, శ్రీనాన్నగారి వాక్యాన్ని అంటే హితోపదేశాన్ని హృదయంతో గ్రహించడం జరుగుతుంది, ఆచరణ అనేది ప్రయత్నపూర్వకంగా కాకుండా, సహజంగానే జరగడం అనేది తెలుస్తూనే ఉంటుంది.

శ్రీనాన్నగారిని వారు చెప్పిన విధంగా గౌరవిస్తూ,
"**శ్రీనాన్నసన్నిధి**"లో ఉందాం.

✸✸✸

## (2) భగవంతుని న్యాయం

ఒక భక్తురాలికి కేన్సర్ వ్యాధి వచ్చింది.

శ్రీనాన్నగారు: పెద్ద వైద్యం చేయించనా అమ్మా?

భక్తురాలు: పెద్ద వైద్యం చేసినా నేను భూమ్మీద ఇంకో నూరు సంవత్సరాలు ఉండను. ఏ వైద్యం వద్దు నాన్నగారు! మీ మీద ఉన్న భక్తి చెదిరిపోకుండా ఉంటుందా అన్నది చెప్పండి.

శ్రీనాన్నగారు: అణా పైసలతో సహా మీ భక్తి మరు జన్మకి ట్రాన్స్‌ఫర్ (బదిలీ) అయి తీరుతుందమ్మా! అది డివైన్ లా (Divine Law అంటే, **భగవంతుని న్యాయం**).

♦♦♦

గురుపరంపరకు నమస్కారములు చెప్పుకొని, శ్రీనాన్నగారు చెప్పిన **భగవంతుని న్యాయం** గురించి మననం చేసుకుందాం.

ఆధ్యాత్మిక సాధనలో మోక్షం సాధించాలనే కోరిక ఉన్నవారికి తమ కోరిక తీరకుండానే ఈ జన్మ ముగిసిపోతే, ఈ జన్మలో చేసిన సాధన వృథా అవుతుందా అని ఆందోళన కలగుతుంది.

ఈ ఆందోళన తీర్చడానికి శ్రీకృష్ణభగవానుడు ఇలా చెప్పాడు:

**నేహాభిక్రమనాశోఽస్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥**

(భగవద్గీత 2–40)

ఈ కర్మయోగం అనే మోక్షమార్గంలో ప్రారంభించింది నష్టం కాదు. విపరీత ఫలితాలు ఉండవు. స్వల్పంగా ఆచరించినా ఈ ధర్మం మహా భయంనుండి రక్షిస్తుంది.

ఇక్కడ మహా భయం అంటే జననమరణ రూప సంసారమనే మహా భయం అని శ్రీశంకరులు చెప్పారు.

♦♦♦

ఇదే విషయమై, ఆ తరువాత అర్జునుడి సందేహం, శ్రీకృష్ణభగవానుడి సమాధానం కూడా చూద్దాం.

**అర్జునుడు**

కృష్ణా! శ్రద్ధ ఉండి కూడా ప్రయత్నలోపం వలన యోగంనుండి మనస్సు చలించి యోగస్థితి పొందని వారి గతి ఏమిటి?

(భగవద్గీత 6–37)

అతడు ఇహపరములు (స్వర్గమోక్షములు) రెండింటికి చెడి, బ్రహ్మమార్గంలో దారితప్పి నిలువనీడలేక చెల్లాచెదురైన మబ్బులాగా నాశనం కాడా? (భగవద్గీత 6-38)

**శ్రీకృష్ణభగవానుడు**

అర్జునా! ఈ లోకంలోగాని, పరలోకంలోగాని యోగభ్రష్టుడికి నాశనం కలగదు. మంచిపనులు చేసేవాడు చెడుగతిని పొందడు. (భగవద్గీత 6-40)

యోగభ్రష్టుడు (చనిపోయాక) పుణ్యలోకాలను పొంది, అక్కడ అనేక సంవత్సరాలు నివసించి, తరువాత శుచులు, శ్రీమంతులు అయినవారి ఇంట పుడతాడు. (భగవద్గీత 6-41)

లేక, జ్ఞానవంతులైన యోగుల కుటుంబంలో పుడతాడు. లోకంలో ఇటువంటి జన్మ చాలా దుర్లభం. (భగవద్గీత 6-42)

ఉత్తమతరగతి యోగికి అలాంటి అరుదైన జన్మ లభిస్తుందని భావం.

అక్కడ, యోగుల కుటుంబంలో పూర్వదేహంలో కలిగిన బుద్ధితో సంయోగం లభిస్తుంది. ఆ పూర్వ సంస్కారంతో మరింత ఎక్కువగా మోక్షం కోసం ప్రయత్నం చేస్తాడు.

(భగవద్గీత 6-43)

అతడు యోగాభ్యాసానికి తానుగా అనుకోకపోయినా, పూర్వజన్మ అభ్యాసబలంవలనే యోగంవైపుకు ఈడ్చుకొని పోబడుతాడు. యోగం తెలుసుకోవాలని కోరిక కలవాడు కూడా శబ్దబ్రహ్మాన్ని (వేదం చెప్పిన కర్మానుష్ఠాన ఫలం) దాటిపోతాడు.

(భగవద్గీత 6-44)

ఈ (6-44) శ్లోకానికి భాష్యంలో శ్రీశంకరులు ఇలా చెప్పారు:

యోగాభ్యాస సంస్కారం కంటే అధిక బలం గల పాపకర్మలు చేయకపోతే యోగాభ్యాసం వలన కలిగిన సంస్కారంతో నడిపింపబడతాడు. చేసిన పాపకర్మల బలం ఎక్కువైతే యోగంవలన కలిగిన సంస్కారం అణిగి ఉంటుంది. ఆ పాపకర్మల బలం అయిపోగానే యోగసంస్కారం తన పని ప్రారంభిస్తుంది. ఎంత ఎక్కువకాలం అణిగి ఉన్నా, యోగ సంస్కారం నశించిపోదు.

***

ఈ సందర్భంలో, **భగవంతుని న్యాయం** అమలు అవడం గురించి మనకు బాగా తెలిసిన రెండు ముఖ్యమైన ఉదాహరణలు చూద్దాం:

1. **భగవాన్ శ్రీరమణమహర్షి**

మనకు తెలిసిన జన్మలో వారు ఏ సాధనా చేయలేదు.

మీరు ఏ సాధన చేయలేదు కదా అన్నదానికి భగవాన్

"నా సాధన గతంలోనే పూర్తి అయి ఉంటుంది" అని అన్నారు.

2. **సద్గురు శ్రీనాన్నగారు**

మనకు తెలిసిన జన్మలో వారు ఏ సాధనా చేయలేదు.

వారి సాధన కూడా గతంలోనే పూర్తి అయి ఉంటుంది.

గురువుగారి విషయంలోనూ, వారి గురువుగారి విషయంలోనూ **భగవంతుని న్యాయం** అమలు అయింది, అంటే వారి భక్తి, జ్ఞానం, సాధన అణాపైసలతో సహా బదిలీ అయిందని తెలుస్తోంది కదా!

శాస్త్రంలో (భగవద్గీతలో) చెప్పింది, సద్గురు శ్రీనాన్నగారి ఉపదేశంలో వచ్చింది, పైన చెప్పుకున్న రెండు ఉదాహరణలు – వీటన్నింటినీ బట్టి

**సాధన చేసింది వృథా కాదు, దానికి తగిన మంచి ఫలితం తప్పకుండా వస్తుంది.**

అది "**భగవంతుని న్యాయం**" అని విశ్వాసంతో వీలైనంత సాధన చేయాలి.

✸✸✸

## (3) ఆత్మజ్ఞానం

ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుందనే విషయమై 23-01-2003 తేదీన సద్గురు శ్రీనాన్నగారు వారి జ్ఞానబోధలో ఇలా చెప్పారు:

గురువుయొక్క ప్రేమలో, ఈశ్వరుడియెక్క ప్రేమలో మునిగి తేలుతుంటే, అహంకారం, మమకారం వాటంతట అవే పోతాయి.

**గురువుయొక్క ప్రేమలో, ఈశ్వరుడియెక్క ప్రేమలో ఉక్కిరిబిక్కిరి అవుతుంటే, అహంభావన నశించి ఆత్మజ్ఞానం కలుగుతుంది.**

రమణమహర్షి చాలా గొప్పవారు అని ఎవరైనా వ్రాస్తే ఆ పేపర్ కటింగ్స్ లైబ్రరీలో పెట్టమనేవారు. ఎందుకలా పెట్టమనేవారంటే:

**మన దేహాలు ఎప్పుడూ ఉండవు. రమణమహర్షి జ్ఞానం గురించి, ఎవరైనా వ్రాస్తే, తరువాత తరాలవాళ్ళు చూసుకుంటారు అని లైబ్రరీలో పెట్టమనేవారు.**

మమకారం నశించినవాడే మోక్షాన్ని పొందుతాడు.
మమకారం నశించకుండా ఎవరూ మోక్షాన్ని పొందలేరు.

**మమకారం నశించకుండా ఎవరి భక్తులైనా మోక్షం రాదు, శ్రీరమణమహర్షి గారి భక్తులైనా కూడా రాదు, శ్రీకృష్ణుడి భక్తులైనా రాదు.**

సమానబుద్ధి లేనివాడు గురువు ఏమిటి?
ప్రపంచమే లేనివాడికి కీర్తికాంక్ష ఏమిటి?

**ఆయనకు (గురువుకు) దేహం లేదు, మనస్సు లేదు, ప్రపంచం లేదు, దేవుడు కూడా లేడు.**

(గురువుకు దేవుడు కూడా లేడు అని నాన్నగారు ఎందుకు అన్నారంటే అద్వైతానుభవంలో ఉన్నవారికి అన్యంగా అంటే వేరుగా ఏదీ లేదు గనుక).

♦♦♦

ఈ వాక్యాలు గురుదేవులు శ్రీనాన్నగారి జ్ఞానవైభవాన్ని చెబుతున్నాయి. వారికి నమస్కరిస్తూ ఈ జ్ఞానబోధను **మననం** చేద్దాం:

1. **గురువు, ఈశ్వరుడు, గురుపరంపర**

గురువు, ఈశ్వరుడు వేరు వేరు కాదు.

అందుకే, గురువు ప్రేమ, ఈశ్వరుడి ప్రేమ అని నాన్నగారు చెప్పారు.

అంటే, గురువును తలుచుకుంటే, భగవంతుడిని తలుచుకున్నట్లే.

అలాగే, భగవంతుడిని తలుచుకుంటే, గురువుని తలుచుకున్నట్లే.

ఇంకా, గురువు, గురుపరంపర వేరు వేరు కాదు.

అంటే, శ్రీశంకరులు, శ్రీరమణమహర్షి, శ్రీనాన్నగారు వేరు వేరు కాదు.

భగవంతుడే సద్గురువుల రూపాలలో వస్తూ ఉన్నాడు.

## 2. **గురువు ప్రేమ, జ్ఞానం**

గురువు ప్రేమ, జ్ఞానం వేరు వేరు కాదు.

గురువు జ్ఞానస్వరూపుడు. ఆ జ్ఞానస్వరూపుడి ప్రేమ అంటే, అది జ్ఞానమే.

గురువుగారిలో మూర్తీభవించిన జ్ఞానం ప్రేమగా వ్యక్తమవుతుంది.

## 3. అహంభావన

అహంభావన అంటే అహంకారం, మమకారం (నేను, నాది అనేవి).

**మమకారం నశించకుండా ఎవరూ మోక్షాన్ని పొందలేరు.**

మమకారం నశించకుండా ఎవరి భక్తులైనా మోక్షం రాదు, శ్రీరమణమహర్షి గారి భక్తులైనా కూడా రాదు, శ్రీకృష్ణుడి భక్తులైనా రాదు.

## 4. మునిగి తేలడం, ఉక్కిరిబిక్కిరి అవ్వడం

మునిగి తేలడం, ఉక్కిరి బిక్కిరి అవ్వడం అంటే మమేకం అంటే ఒక్కటవ్వడం.

గురువు ప్రేమలో అంటే జ్ఞానంతో మమేకం కావాలి.

గురువుగారి జ్ఞానబోధలోని సారం గ్రహించి వారిలాగే జ్ఞానస్వరూపులైన వారికి అహంభావన పోయి, అంటే అహంకారం, మమకారం పోయి, ఆత్మజ్ఞానం కలుగుతుందని గురుదేవులు శ్రీనాన్నగారి బోధ.

## 5. సత్సంగం

గురువుగారి జ్ఞానబోధలోని సారం గ్రహించడానికి, వారి బోధలను

**శ్రవణం** అంటే సద్గురువు చెప్పిన శాస్త్రజ్ఞానం విని అర్థం చేసుకోవడం,

**మననం** అంటే శ్రవణంలో తెలుసుకున్నదానిలో సందేహాలు తొలగించుకొని నిశ్చయజ్ఞానం పొందడం,

**నిదిధ్యాసనం** అంటే శ్రవణ మననాలద్వారా తెలుసుకొన్నదానిని ఏకాగ్రతతో నిరంతరం చింతన చేయడం.

– ఈ మూడు చేయాలి.

ఈ విధంగా, సాధకుడి సత్సంగం అంతా గురుపరంపర చెప్పిన శాస్త్రజ్ఞానం మీద కేంద్రీకృతమై ఉండాలి.

అలా గురువుగారి ప్రేమలో అంటే జ్ఞానంలో మునిగితేలి లేదా ఉక్కిరిబిక్కిరి అయిన సాధకుడికి అహంభావన పోయి, ఆత్మజ్ఞానం కలుగుతుంది.

***

## (4) గీతా రహస్యం

శ్రీనాన్నగారు:

**భగవంతుడు మీ శరీరానికి ఏ పనైతే ఇచ్చాడో, ఆ పని అయిష్టంగా చేయకండి, ఇష్టంగా చేయండి.**

మీ అత్తగారిని మీరు చూడవలసిన ప్రారబ్ధం మీమీద ఉంది అనుకోండి. అది ఇష్టం లేకపోయినా, ఆవిడ బ్రతికున్నంతవరకు ఇష్టంతోనే చూడండి. ఇదేం ఖర్మ అనుకోకుండా చూసేయండి. జాగ్రత్తగా వినండి. ఇది గీతా రహస్యం. ఇంటిదగ్గర ఏ పనులైతే మీరు చేయాలో, ఆ పనులను మీ ఇష్టా, అయిష్టాలతో సంబంధం లేకుండా చేసేయ్యండి.

**నీ దేహ ప్రారబ్ధంలోని పని నీ ఇష్టంతో చేస్తే నీకు బంధం తగ్గిపోతుంది. ఇష్టం లేకుండా చేస్తే బంధం పెరిగిపోతుంది, పునర్జన్మలు పెరిగిపోతాయి.**

ఇష్టంగా చేస్తే ఇంతవరకు ఉన్న ప్రారబ్ధం నశిస్తుంది. కొత్తగా ప్రారబ్ధం రాదు. పాత అప్పులు తీరిపోతాయి. కొత్త అప్పులు చేయవలసిన అవసరం రాదు.

భగవంతుడు ఇచ్చిన డ్యూటీ (కర్తవ్యం) నీకు ఇష్టం లేకపోయినా, ఇష్టం చేసుకొని చేయమని చెప్పడం గీతా రహస్యం.

**హృదయ దౌర్భల్యం పనికిరాదు. హృదయంలో పిరికితనం పెట్టుకుంటే మీరు అభివృద్ధిలోకి రారు.**

♦♦♦

**గీతా రహస్యం – శరణాగతి**

గురుదేవులు శ్రీనాన్నగారు గీతా రహస్యం అద్భుతంగా చెప్పారు. ఇది గీతా రహస్యం ఎలా అవుతుందని కొంతమందికి సందేహం రావచ్చు. భగవద్గీత సారం అంతా మోక్ష సన్యాసయోగంలో 66 వ శ్లోకంలో ఉందని చెబుతారు. ఆ శ్లోకం:

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

(భగవద్గీత 18-66)

అన్ని దర్మాలను వదిలేసి, నన్ను ఒక్కడినే శరణు పొందు. నేను నిన్ను అన్ని పాపాలనుండి విడిపిస్తాను, దుఃఖించకు.

ఈ శ్లోకంలో శరణాగతి గురించి చెప్పారు. అంటే **భగవద్గీత సారం శరణాగతి** అని అర్థం.

**భగవంతుడు మీ శరీరానికి ఏ పనైతే ఇచ్చాడో, ఆ పని అయిష్టంగా చేయకుండా, ఇష్టంగా చేయడమే శరణాగతి.**

అహంకారం ఉన్నవారు సంపూర్ణ శరణాగతి చెందడం కష్టం కాబట్టి ముందుగా పాక్షిక శరణాగతి చేయండి అని శ్రీనాన్నగారు చెప్పేవారు.

గీతా రహస్యమైన శరణాగతిని ఎలా ఆచరణలో పెట్టాలి అనేది ఉదాహరణతో సహా చెప్పారు.

**"నీ దేహ ప్రారబ్ధంలోని పని నీ ఇష్టంతో చేస్తే నీకు బంధం తగ్గిపోతుంది. ఇష్టం లేకుండా చేస్తే బంధం పెరిగిపోతుంది, పునర్జన్మలు పెరిగిపోతాయి."**

ఆ శరణాగతి చేయడం వలన కలిగే లాభం, చేయకపోతే వచ్చే నష్టం గురించి కూడా చెప్పారు.

ఆత్మబంధువు శ్రీనాన్నగారి జ్ఞానబోధను ఆచరణలో పాటించి ధన్యులం అవుదాం!

✸✸✸

## (5) గురూపదేశం

**వేదాంతార్థ విచారేణ జాయతే జ్ఞానముత్తమమ్ ।**
**తేనాత్యంతిక సంసారదుఃఖనాశో భవత్యను ॥**

(వివేకచూడామణి 47)

| | | |
|---|---|---|
| జ్ఞానముత్తమమ్ | = | జ్ఞానం + ఉత్తమం |
| తేనాత్యంతిక | = | తేన +అత్యంతిక |
| భవత్యను | = | భవతి + అను |
| వేదాంతాం | = | ఉపనిషత్తుల అర్థం, |
| విచారేణ | = | విచారణ చేయడంచేత, |
| ఉత్తమం | = | ఉత్తమమైన, |
| జ్ఞానం | = | జ్ఞానం, |
| జాయతే | = | జనిస్తుంది, |
| తేన | = | దానిచేత, |
| అను | = | వెంటనే, |
| అత్యంతిక | = | నిశ్శేషంగా, |
| సంసారదుఃఖనాశః | = | సంసారదుఃఖనాశనం, |
| భవతి | = | జరుగుతుంది. |

**ఉపనిషత్తుల అర్థం విచారణ చేయడంచేత ఉత్తమమైన జ్ఞానం జనిస్తుంది. దానిచేత వెంటనే నిశ్శేషంగా సంసార దుఃఖనాశనం జరుగుతుంది.**

## శ్రీనాన్నగారు

ఉపనిషత్తులలో ఉన్న మంత్రాల అర్థాన్ని విచారణ చేయడంవలన నీకు ఆత్మజ్ఞానం అనేది ఎప్పుడైనా లోపలినుంచి రావాలిగాని బయటనుంచి వచ్చేది కాదు.

ఏ వస్తువులో అయితే దుఃఖం లేదో ఆ వస్తువును నువ్వు పొందేవరకు దుఃఖం నిన్ను వెంటాడుతుంది. సెక్స్‌ను జయించడానికి చాలామంది చాలా సాధనలు చేస్తారు. ఏ వస్తువులో అయితే సెక్స్ లేదో అది పొందేవరకు నిన్ను నువ్వు నమ్మడానికి వీలు లేదు. ఏ వస్తువులో అయితే దుఃఖం లేదో అది నువ్వు పొందేవరకు నువ్వు దుఃఖరహితం అనడానికి వీలులేదు. ఇవాళ అణిగి ఉండవచ్చు, రేపే రావొచ్చు. రోగం అణిగి ఉన్నా, హఠాత్తుగా రేపు రావొచ్చు కదా! అణిగి ఉన్న పాము ఎప్పటికైనా ప్రమాదమే కదా! చనిపోయిన పామువల్ల ప్రమాదం లేదు.

సంసారం ఎక్కడ ఉంది? బయట లేదు, మనస్సులో ఉంది. మనస్సుకు మరో పేరు సంసారం. మనస్సు ఉన్నవాడికి పెళ్ళి అవకపోయినా వాడు సంసారే.

సంసారదుఃఖనాశనం ఆత్మజ్ఞానం కలిగిన తరువాత అంటే ఆత్మ ఎరుకలోకి రావడంవల్ల కలుగుతుంది. ఆత్మలో సుఖమేగాని దుఃఖం ఎలా ఉంటుందో తెలియదు. సూర్యుడికి చీకటి ఎలా

ఉంటుందో తెలియదు. జ్ఞానికి అశాంతి ఉండదు, అజ్ఞానికి శాంతి ఉండదు. ఒక్క ఆత్మసాక్షాత్కారం పొందినవాడు మాత్రమే లోకంలో నిజమైన సుఖి. మిగతా వాళ్ళందరికీ తాత్కాలికంగా దుఃఖం రాకపోయినా వాళ్ళకి కోర్టు వాయిదా వేసినట్టు దుఃఖం వాయిదా పడుతూ ఉంటుంది.

రమణమహర్షి "ఉన్నదాన్ని వెతకండి, లేనిదాన్ని వెతక్కండి" అని చెప్పారు. లేనిది మనస్సు. ఉన్నది ఆత్మ, దానికోసం వెతికితే అది ఎరుకలోకి వస్తుంది. ఆత్మకోసం వెతికితే ఆత్మ తెలియబడుతుంది.

దుఃఖం బయట లేదు, మనస్సులో ఉంది. ఇల్లు కాలిపోతే, ఆ ఇంటితోపాటు ఎలుకలు కూడా కాలిపోతాయి. సంసారం అంటే మనస్సే! మనుషులు సంసారం కాదు. మనస్సే కాలిపోతే ఇంక దుఃఖం ఎక్కడ ఉంటుంది?

అసలు దుఃఖం అనేది లేదు. అది ఒక తలంపు. సంతోషం కూడా ఒక తలంపు. నీకు ఇష్టం లేని తలంపు వస్తే దుఃఖం వచ్చేస్తుంది. నీకు ఇష్టమైన తలంపు వస్తే సంతోషం వచ్చేస్తుంది. తలంపు లేకపోతే దుఃఖం లేదు, సుఖం లేదు. ఇదీ అబద్ధం, అదీ అబద్ధం. **నీ తలంపు ఎంత నిజమో నీ దుఃఖం, నీ సంతోషం అంతే నిజం.**

✸✸✸

## అష్టావక్రగీత
## పదకొండవ అధ్యాయం (నిశ్చయజ్ఞానం)

అష్టావక్ర ఉవాచ :-

**భావాభావవికారశ్చ స్వభావాదితి నిశ్చయీ,**
**నిర్వికారో గత క్లేశః సుఖేనైవోపశామ్యతి.** (అ.గీ. 11-1)

భావం (జననం), అభావం (మరణం), వికారాలు (మార్పులు) అన్నీ స్వభావంవల్లనే జరుగుతుంటాయి అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, వికారం లేనివాడై, దుఃఖం లేనివాడై, సుఖంగానే (సునాయాసంగానే) శాంతిని పొందుతాడు.

**ఈశ్వరః సర్వనిర్మాతా నే హాన్య ఇతి నిశ్చయీ,**
**అంతర్గళిత సర్వాశః శాంతః క్వాపి న సజ్జతే.** (అ.గీ. 11-2)

ఈశ్వరుడు సర్వనిర్మాణానికి కారణం, ఈ విషయంలో వేరెవ్వరూ లేరు అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, అంతరంగంలో ఆశలన్నీ నశించినవాడై, శాంతుడై, ఏ లౌకిక వ్యవహారాలమీదా ఆసక్తి కలవాడు కాడు.

**ఆపదః సంపదః కాలే దైవాదేవేతి నిశ్చయీ,**
**తృప్తః స్వస్థేంద్రియో నిత్యం న కాంక్షతి న శోచతి.** (అ.గీ. 11-3)

ఆపదలు, సంపదలు దైవంవలన నిశ్చితకాలంలో మాత్రమే లభిస్తాయి అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, అన్ని వేళలా తృప్తి చెందినవాడై, ఉపశమించిన ఇంద్రియాలు కలవాడై, దేనినీ కోరడు, దేనికీ దుఃఖించడు.

**సుఖదుఃఖే జన్మమృత్యు దైవాదేవేతి నిశ్చయీ,**
**సాధ్యాదర్శీ నిరాయాసః కుర్వన్నపి న లిప్యతే.** (అ.గీ. 11-4)

సుఖదుఃఖాలు, జననమరణాలు దైవంవలన మాత్రమే కలుగుతాయి అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, సాధ్యములను చూడనివాడు, శ్రమ లేనివాడై; కర్మలను చేస్తున్నవాడై కూడా, చేసిన కర్మచే బంధింపబడడు.

**చింతయా జాయతే దుఃఖం నాన్యథేహేతి నిశ్చయీ,**
**తయా హీనః సుఖీ శాంతః సర్వత్ర గళిత స్పృహః** (అ.గీ. 11-5)

ఈ ప్రపంచంలో చింతవలననే దుఃఖం కలుగుతుంది, వేరే దేనివలనా కాదు అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, ఆ చింత లేనివాడై, సుఖంగా, శాంతంగా, దేనిమీదా కోరిక లేనివాడై ఉంటాడు.

**నాహం దేహో న మే దేహో బోధోహమితి నిశ్చయీ,**
**కైవల్యమివ సంప్రాప్తో న స్మరత్యకృతం కృతమ్.** (అ.గీ. 11-6)

నేను దేహమును కాను, ఈ దేహం నాది కాదు, నేను జ్ఞానస్వరూపుడును అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, విదేహముక్తిని పొందినవాడై, చేయనిదానిని గురించి కాని, చేసినదానిని గురించి కాని తలుచుకోడు.

**ఆ బ్రహ్మస్తంబపర్యంతం అహమేవేతి నిశ్చయీ,**
**నిర్వికల్ప శ్శుచి శ్శాంతః ప్రాప్తాప్రాప్త వినిర్వృతః** (అ.గీ. 11-7)

బ్రహ్మ మొదలు గడ్డిపోచ వరకు నేనే అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, నిర్వికల్ప స్వరూపుడై, నిర్మలుడై, శాంతుడై, లభించిన దానిమీదా, లభించని దానిమీదా విముఖుడై ఉంటాడు.

**నానాశ్చర్య మిదం విశ్వం న కించిదితి నిశ్చయీ,**
**నిర్వాసనః స్ఫూర్తిమాత్రో న కించి దివశామ్యతి.** (అ.గీ. 11-8)

ఈ ప్రపంచం అనేక ఆశ్చర్యాలు కలది, ఏమీ లేనిది అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, వాసనలు లేనివాడై, శుద్ధ చైతన్య స్వరూపుడై, ఏమీ లేదు అన్న విధంగా, శాంతంగా ఉంటాడు.

✹✹✹

# అష్టావక్రగీత

## పదకొండవ అధ్యాయం (నిశ్చయజ్ఞానం)

అష్టావక్ర ఉవాచ ః-

**భావాభావవికారశ్చ స్వభావాదితి నిశ్చయీ,**
**నిర్వికారో గత క్లేశః సుఖేనైవోపశామ్యతి.** (అష్టావక్రగీత 11-1)

భావాభావవికారశ్చ = భావ + అభావ + వికారః + చ
స్వభావాదితి = స్వభావాత్ + ఇతి
సుఖేనైవోపశామ్యతి = సుఖేన + ఏవ + ఉపశామ్యతి

భావ = భావం (జననం),
అభావ = అభావం (మరణం),
వికారః చ = వికారాలు (మార్పులు) అన్నీ,
స్వభావాత్ = స్వభావంవల్లనే,
(వర్తతే = జరుగుతుంటాయి),
ఇతి = అని,
నిశ్చయీ = నిశ్చయజ్ఞానం కలిగినవాడు,
నిర్వికారః = వికారం లేనివాడై,
గత క్లేశః = దుఃఖం లేనివాడై,
సుఖేన ఏవ = సుఖంగానే (సునాయాసంగానే),
ఉపశామ్యతి = ఉపశమిస్తాడు (శాంతిని పొందుతాడు).

**భావం (జననం), అభావం (మరణం), వికారాలు (మార్పులు) అన్నీ స్వభావంవల్లనే జరుగుతుంటాయి అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, వికారం లేనివాడై, దుఃఖం లేనివాడై, సుఖంగానే (సునాయాసంగానే) శాంతిని పొందుతాడు.**

ముందు ప్రాణుల వికార స్వభావ నిశ్చయజ్ఞానం గురించి చెప్పి తరువాత అందువలన కలిగే ఫలితాన్ని గురించి చెబుతున్నారు.

వికారం అంటే మార్పు చెందడం. జాయతే (పుట్టడం), అస్తి (ఉండడం), వర్ధతే (పెరగడం), విపరిణమతి (మార్పుచెందడం), అపక్షీయతే (క్షీణించడం), వినశ్యతి (లేకపోవడం) అని ఆరు వికారాలు. 'భావం' అంటే జాయతే (పుట్టడం) అనే మొదటి వికారం. 'అభావం' అంటే వినశ్యతి (లేకపోవడం) అనే చివరి వికారం.

సన్నిహితులు చనిపోతున్నారన్నా, చనిపోయినా చాలా బాధ కలుగుతుంది.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు:

**అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్త నిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥** (భగవద్గీత 2-28)

అర్జునా! ప్రాణులు పుట్టడానికి ముందు కనిపించవు. మధ్యలో కనిపిస్తున్నాయి. మరణించిన తరువాత కూడా కనిపించవు. అటువంటి వాటికొరకు దుఃఖమెందుకు?

గురుపరంపర చేసిన బోధల ఆధారంగా శాస్త్రం అంటే ప్రకరణ గ్రంథాలు, భగవద్గీత, ఉపనిషత్తులు శ్రవణ మననాలు చేసినవాడు విచారణ చేసి, తాను ఈ దేహం కానని, వికారాలు లేని సాక్షినని తెలుసుకుంటాడు.

తాను సాక్షినని తెలుసుకొని, ప్రాణులకు చావుపుట్టుకలు మొదలైన వికారాలు వాటి స్వభావంవల్లనే కలుగుతుంటాయి అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, దేహాభిమానం లేనివాడై, వికారం లేనివాడై, దుఃఖం లేనివాడై, సుఖంగా, ప్రశాంతంగా ఉంటాడు.

✸✸✸

**ఈశ్వరః సర్వనిర్మాతా నే హాన్య ఇతి నిశ్చయీ,**
**అంతర్గళిత సర్వాశః శాంతః క్వాపి న సజ్జతే.**

(అష్టావక్రగీత  11-2)

నే హాన్య = న + ఇహా + అన్య
క్వాపి = క్వ + అపి

ఈశ్వరః = ఈశ్వరుడు,
సర్వనిర్మాతా = సర్వనిర్మాణానికి కారణం,
ఇహా = ఈ విషయంలో,
అన్యః = వేరెవ్వరూ,
న = లేరు,
ఇతి = అని,
నిశ్చయీ = నిశ్చయజ్ఞానం కలిగినవాడు,
అంతర్గళిత సర్వాశః = అంతరంగంలో ఆశలన్నీ నశించినవాడై,
శాంతః = శాంతుడై,
క్వ = దేనిలో(ఏ లౌకిక వ్యవహారాలమీదా),
అపి = కూడా,
న సజ్జతే = ఆసక్తి కలవాడు కాడు.

**ఈశ్వరుడు సర్వనిర్మాణానికి కారణం, ఈ విషయంలో వేరెవ్వరూ లేరు అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, అంతరంగంలో ఆశలన్నీ నశించినవాడై, శాంతుడై, ఏ లౌకిక వ్యవహారాలమీదా ఆసక్తి కలవాడు కాడు.**

ఈ శ్లోకంలో సృష్టి నిర్మాణ నిశ్చయజ్ఞానం చెప్పి తరువాత అందువలన కలిగే ఫలితాన్ని గురించి చెబుతున్నారు.

భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు ఇలా చెప్పాడు:

**అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।**
**ఇతి మత్వా భజంతే మాం బుధాః భావసమన్వితాః ॥**

(భగవద్గీత 10-8)

సర్వజగత్తు నా వలననే పుడుతున్నది, ప్రవర్తిస్తున్నది అని తెలుసుకొని, పరమార్థ భావం గలవారై జ్ఞానులు నన్ను భజిస్తున్నారు.

ఇక్కడ 'నా వలననే' అంటే 'ఈశ్వరుడి వలననే' అని, 'నన్ను' అంటే 'ఈశ్వరుడిని' అని అర్థం చేసుకోవాలి.

అజ్ఞానంలో ఉన్నప్పుడు, అహంకారంతో "నేను అది చేశాను, ఇది చేశాను" అనుకుంటాడు. ఇంకా, ఇతరులు ఏదో చేశారని కూడా అనుకుంటాడు. సత్సంగంలో శ్రవణ మననాల వలన, తన జీవితంలో, ఇతరుల జీవితాలలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలించిన తరువాత, పరిణితి వచ్చి, జ్ఞానం కలిగి "నేనుగాని, ఇతరులుగాని చేయడంలేదు, అంతా ఈశ్వరుడే చేస్తున్నాడు" అని తెలుసుకుంటాడు.

శ్రీకృష్ణుడు చెప్పినట్లు ప్రాణులన్నీ "నిమిత్తమాత్రం భవ" అంటే కేవలం నిమిత్తమాత్రమే అని తెలుసుకుంటాడు. అంతే కాదు. తాను కర్తనూ కాదు, భోక్తనూ కాదని తెలుసుకుంటాడు. అంటే, తాను చేసేవాడూ కాదు, అనుభవించేవాడూ కాదు, తాను సాక్షినని తెలుసుకుంటాడు.

అలా ఈశ్వరుడు మాత్రమే సర్వనిర్మాణానికి కారణం అని నిశ్చయజ్ఞానం కలిగినవాడికి, లౌకిక వ్యవహారాలమీద ఆసక్తి లేక ఆశలు, కోరికలు అనే విషవలయంనుండి బయటపడి శాంతంగా ఉండడం అనే గొప్ప ఫలితం లభిస్తుందని చెబుతున్నారు.

***

**ఆపదః సంపదః కాలే దైవాదేవేతి నిశ్చయీ,**
**తృప్తః స్వస్థేంద్రియో నిత్యం న కాంక్షతి న శోచతి.**

(అష్టావక్రగీత 11-3)

| | | |
|---|---|---|
| దైవాదేవేతి | = | దైవాత్ + ఏవ + ఇతి |
| ఆపదః | = | ఆపదలు, |
| సంపదః | = | సంపదలు, |
| దైవాత్ | = | దైవంవలన, |
| కాలే | = | నిశ్చితకాలంలో, |
| ఏవ | = | మాత్రమే, |
| (ప్రాప్యేత | = | లభిస్తాయి), |
| ఇతి | = | అని, |
| నిశ్చయీ | = | నిశ్చయజ్ఞానం కలిగినవాడు, |
| నిత్యం | = | అన్ని వేళలా, |
| తృప్తః | = | తృప్తి చెందినవాడై, |
| స్వస్థేంద్రియః | = | ఉపశమించిన ఇంద్రియాలు కలవాడై, |
| న కాంక్షతి | = | (దేనినీ) కోరడు, |
| న శోచతి | = | (దేనికీ) దుఃఖించడు. |

**ఆపదలు, సంపదలు దైవంవలన నిశ్చితకాలంలో మాత్రమే లభిస్తాయి అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, అన్ని వేళలా తృప్తి చెందినవాడై, ఉపశమించిన ఇంద్రియాలు కలవాడై, దేనినీ కోరడు, దేనికీ దుఃఖించడు.**

ప్రారబ్ధానికి సంబంధించిన నిశ్చయజ్ఞానం గురించి చెప్పి తరువాత అందువలన కలిగే ఫలితాన్ని గురించి చెబుతున్నారు.

ఇప్పటి కర్మల ఫలితాలే కాకుండా గతంలో చేసిన కర్మల ఫలాలు కూడా మానవులు అనుభవించవలసి ఉంటుంది. అందువలన జీవులకు వారి వారి ప్రారబ్ధాన్ని అనుసరించి సరైన సమయాలలో భగవంతుడు వారికి తగిన ఆపదలను, సంపదలను ఇవ్వడం జరుగుతుంది. ఈ నిశ్చయజ్ఞానం కలిగినవానికి ఫలితం ఇలా ఉంటుందని చెబుతున్నారు:

**తృప్తః –** తన ప్రయత్న లోపం లేకుండా కర్మలు చేసినవాడు, కర్మఫలం ఆలస్యంగా లభించినా, అసలు లభించకపోయినా, అనుకోని విధంగా లభించినా, అంతా దైవానుగ్రహమేనని, అన్ని వేళలా సంతృప్తి చెందినవాడై ఉంటాడు.

**స్వస్థేంద్రియః –** ఎటువంటి ఆందోళనలు, భావోద్వేగాలు లేకుండా ఉపశమించిన ఇంద్రియాలు కలవాడై శాంతంగా ఉంటాడు.

**న కాంక్షతి న శోచతి –** ఎప్పుడు ఏది నాకు ఇవ్వాలో అది భగవంతుడే ఇస్తాడు, అందువలన నేను కోరుకోవలసింది ఏదీ లేదు, దేనికీ దుఃఖించవలసిన అవసరం లేదు అనుకుని ప్రశాంతంగా ఉంటాడు.

***

**సుఖదుఃఖే జన్మమృత్యు దైవాదేవేతి నిశ్చయీ,**
**సాధ్యాదర్శీ నిరాయాసః కుర్వన్నపి న లిప్యతే.** (అష్టావక్రగీత 11-4)

| | | |
|---|---|---|
| దైవాదేవేతి | = | దైవాత్ + ఏవ + ఇతి |
| సాధ్యాదర్శి | = | సాధ్య + అదర్శి |
| కుర్వన్నపి | = | కుర్వన్ + అపి |

| | | |
|---|---|---|
| సుఖదుఃఖే | = | సుఖదుఃఖాలు, |
| జన్మమృత్యు | = | జననమరణాలు, |
| దైవాత్ | = | దైవంవలన, |
| ఏవ | = | మాత్రమే, |
| (ప్రాప్యేత | = | కలుగుతాయి), |
| ఇతి | = | అని, |
| నిశ్చయీ | = | నిశ్చయజ్ఞానం కలిగినవాడు, |
| సాధ్య అదర్శి | = | సాధ్యములను చూడనివాడు, |
| నిరాయాసః | = | శ్రమ లేనివాడై, |
| కుర్వన్ అపి | = | కర్మలను చేస్తున్నవాడై కూడా, |
| (కృతేన | = | చేసిన కర్మచే), |
| న లిప్యతే | = | బంధింపబడడు. |

**సుఖదుఃఖాలు, జననమరణాలు దైవంవలన మాత్రమే కలుగుతాయి అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు సాధ్యములను చూడనివాడు, శ్రమ లేనివాడై; కర్మలను చేస్తున్నవాడై కూడా, చేసిన కర్మచే బంధింపబడడు.**

జీవులకు వారి వారి ప్రారబ్ధాన్ని అనుసరించి ఆపదలు, సంపదలతో పాటు సుఖదుఃఖాలను, చావుపుట్టుకలను భగవంతుడే ఇస్తాడని నిశ్చయజ్ఞానం కలిగినవాడు ఎలా ఉంటాడో చెబుతున్నారు:

**సాధ్యాదర్శి = సాధ్య + అదర్శి**
ఏ కర్మఫలితానికైనా కారణం దైవమే తప్ప మానవ ప్రయత్నం కాదు కనుక తనకు సాధ్యం అనేది లేదు అంటే తన చేతిలో (పరిధిలో) ఏమీ లేదని తెలుసుకొంటాడు.

**నిరాయాసః –** తను కర్త కాదు, భోక్త కాదు, తను సాక్షినని తెలుసుకొని ఎటువంటి శ్రమ, ఆయాసం అంటే, మానసిక అలజడి లేకుండా, ప్రశాంతంగా ఉంటాడు.

**కుర్వన్నపి న లిప్యతే –** కర్తను కాను, సాక్షిని అను నిశ్చయంతో ఉన్నవాడు కాబట్టి తనచే చేయబడిన కర్మలచే బంధింపబడడు. అంటే, అతడు ఆ కర్మఫలాలను అనుభవించడు.

✸✸✸

**చింతయా జాయతే దుఃఖం నాన్యథేహేతి నిశ్చయీ,**
**తయా హీనః సుఖీ శాంతః సర్వత్ర గళిత స్పృహః**

(అష్టావక్రగీత 11-5)

| | | |
|---|---|---|
| నాన్యథేహేతి | = | న + అన్యథా + ఇహ + ఇతి |
| ఇహ | = | ఈ ప్రపంచంలో, |
| చింతయా | = | చింతవలననే, |
| దుఃఖం | = | దుఃఖం, |
| జాయతే | = | కలుగుతుంది, |
| అన్యథా | = | వేరే దేనివలనా, |
| న ఇతి | = | కాదు అని, |
| నిశ్చయీ | = | నిశ్చయజ్ఞానం కలిగినవాడు, |
| తయా | = | ఆ చింత, |
| హీనః | = | లేనివాడై, |
| సుఖీ | = | సుఖంగా, |
| శాంతః | = | శాంతంగా, |
| సర్వత్ర | = | దేనిమీదా, |
| గళిత స్పృహః | = | కోరిక లేనివాడై, |
| (భవతి | = | ఉంటాడు). |

**ఈ ప్రపంచంలో చింతవలననే దుఃఖం కలుగుతుంది, వేరే దేనివలనా కాదు అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, ఆ చింత లేనివాడై, సుఖంగా, శాంతంగా, దేనిమీదా కోరిక లేనివాడై ఉంటాడు.**

ఈ శ్లోకంలో దుఃఖ కారణ నిశ్చయజ్ఞానం గురించి చెప్పి తరువాత అందువలన కలిగే ఫలితాన్ని గురించి చెబుతున్నారు.

"చితి చనిపోయిన శవాన్ని కాలుస్తుంది,
చింత బ్రతికి ఉండగానే కాలుస్తుంది" అని సామెత.

అలా ఎందుకు చేశాను అని, మరోలా చేసి ఉండవలసింది అని గతం గురించి ఆలోచిస్తున్నా; భవిష్యత్తులో అలా జరుగుతుందేమో అని ఊహిస్తున్నా, దుఃఖం కలుగుతుంది. భూత భవిష్యత్తులను గురించి చింతిస్తూ ఉండిపోకుండా, ఎల్లప్పుడూ వర్తమానంలో నిశ్చలశాంతితో జీవించమని చెబుతున్నారు.

"ప్రతి ప్రాణినీ దాని ప్రారబ్ధం ప్రకారం సృష్టికర్త నడిపిస్తాడు. ఎంత ప్రయత్నించినా సరే, జరగకూడనిది జరగదు. నివారించడానికి ఎంత ప్రయత్నించినా సరే, జరగవలసినది జరగక మానదు. కనుక మౌనంగా ఉండడం శ్రేష్ఠం" అని భగవాన్ శ్రీరమణమహర్షి బోధ.

**కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫల హేతుర్భూ మాతే సంగః అస్తు అకర్మణి ॥**

(భగవద్గీత 2-47)

నీకు కర్మలు చేయడానికే అధికారం ఉంది. కర్మఫలాలను ఆశించడానికి నీకు అధికారం లేదు. కర్మఫలాలకు నీవు కారణం కావద్దు. అలా అని కర్మలు చేయకుండా ఉండడంలో నీకు ఆసక్తి పనికిరాదు.

కర్మఫలాపేక్ష లేకుండా కర్మలను చేయమని శ్రీకృష్ణుడు చెప్పిన బోధను గర్తుంచుకొని చేయవలసిన కర్మలను చేయాలి. వచ్చిన కర్మఫలాన్ని ప్రసాదబుద్ధితో స్వీకరించాలి.

గురుపరంపర చెప్పిన బోధలను అర్థం చేసుకొని, ఈ ప్రపంచంలో చింతవలనే దుఃఖం కలుగుతుంది, వేరే దేని వలనా కాదు అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు ఆ చింత, కోరికలు లేకుండా, సుఖంగా, శాంతంగా ఉంటాడు.

***

**నాహం దేహో న మే దేహో బోధోహమితి నిశ్చయీ,**
**కైవల్యమివ సంప్రాప్తో న స్మరత్యకృతం కృతమ్.**

(అష్టావక్రగీత 11-6)

| | | |
|---|---|---|
| నాహం | = | న + అహం |
| బోధోహమితి | = | బోధః + అహం + ఇతి |
| కైవల్యమివ | = | కైవల్యం + ఇవ |
| స్మరత్యకృతం | = | స్మరతి + అకృతం + కృతమ్ |

| | | |
|---|---|---|
| అహం | = | నేను, |
| దేహః | = | దేహమును, |
| న | = | కాను, |
| దేహః | = | (ఈ) దేహం, |
| మే | = | నాది, |
| న | = | కాదు, |
| అహం | = | నేను, |
| బోధః | = | చిత్ (జ్ఞాన) స్వరూపుడును, |
| ఇతి | = | అని, |
| నిశ్చయీ | = | నిశ్చయజ్ఞానం కలిగినవాడు, |
| కైవల్యం ఇవ | = | విదేహముక్తిని, |
| సంప్రాప్తః | = | పొందినవాడై, |
| అకృతం | = | చేయనిదానిని గురించి కాని, |
| కృతమ్ | = | చేసినదానిని గురించి కాని, |
| న స్మరతి | = | స్మరింపడు (తలుచుకోడు). |

**నేను దేహమును కాను, ఈ దేహం నాది కాదు, నేను జ్ఞానస్వరూపుడును అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, విదేహముక్తిని పొందినవాడై, చేయనిదానిని గురించి కాని, చేసినదానిని గురించి కాని తలుచుకోడు.**

అనేక జన్మల వాసనలతో, దేహాత్మ బుద్ధితో, అజ్ఞానంలో ఉన్న వారికి ఆ నిశ్చయజ్ఞానం కలగడానికి అద్వైతబోధదీపికలో వాసనాక్షయప్రకరణంలో చెప్పిన విధంగా సాధన చేయాలి.

అనాది కాలంనుండి అజ్ఞానంవలన కలిగిన 'దేహమే నేను' అను బుద్ధిని 'విపరీతవాసన' అంటారు. ఆ విపరీతవాసనను బ్రహ్మాభ్యాసంతో వదిలేయాలి. (అద్వైతబోధదీపిక 6 - 17)

"నేను దేహం కాను; పరమాత్మ అయిన నేను దేహాదులకు సాక్షిని" - ఈ విధంగా తత్త్వమును భావించడాన్ని 'బ్రహ్మాభ్యాసం' అంటారు. (అద్వైతబోధదీపిక 6 - 18)

బ్రహ్మమును గురించి ఆలోచించడం, బ్రహ్మమును గురించి చెప్పడం, పరస్పరం బ్రహ్మమును గురించి తెలియజేసుకోవడం, బ్రహ్మమునందు మాత్రమే ఆసక్తి కలిగి ఉండడం - ఇదే బ్రహ్మాభ్యాసమని జ్ఞానులు చెబుతారు.

(అద్వైతబోధదీపిక 6 - 19)

సాక్షిగా ఉండడం అభ్యసించి అహంభావ వాసనను (దేహం నేను అను బుద్ధిని) వదిలిన తరువాత మమతావాసనను (దేహం నాది అను బుద్ధిని) కూడా వదిలేయాలి. (అద్వైతబోధదీపిక 6 - 20)

"సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం" అని భజగోవిందంలో చెప్పినట్లు సత్సంగంద్వారా నిర్మోహత్వం అంటే మోహం అనే అజ్ఞానంనుండి బయటపడి నేను దేహమును కాను, ఈ దేహం నాది కాదు, నేను జ్ఞానస్వరూపుడను అని నిశ్చయజ్ఞానం సాధించాలి.

విదేహముక్తి అంటే, మరణానంతరం మోక్షం లభిస్తుంది అని, తిరిగి జన్మ ఉండదు అని భావం. జీవన్ముక్తుడు అంటే బ్రతికి ఉండగానే మోక్షం పొందినవాడని అర్థం.

తనకు దేహంతో సంబంధం లేదని, తను జ్ఞానస్వరూపుడిని అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, విదేహముక్తిని పొందినవాడై, ఈ దేహం చేయనిదానితోనూ, చేసినదానితోనూ తనకు ఏమీ సంబంధం లేదు అని వాటి గురించి తలుచుకోడు, ఆలోచించడు.

✸✸✸

**ఆ బ్రహ్మస్తంబపర్యంతం అహమేవేతి నిశ్చయీ,**
**నిర్వికల్ప శ్శుచి శ్శాంతః ప్రాప్తాప్రాప్త వినిర్వృతః**

(అష్టావక్రగీత 11-7)

| | | |
|---|---|---|
| అహమేవేతి | = | అహం + ఏవ + ఇతి |
| ప్రాప్తాప్రాప్త | = | ప్రాప్త + అప్రాప్త |
| ఆ బ్రహ్మస్తంబపర్యంతం | = | బ్రహ్మ మొదలు గడ్డిపోచ వరకు, |
| అహం ఏవ | = | నేనే, |
| ఇతి | = | అని, |
| నిశ్చయీ | = | నిశ్చయజ్ఞానం కలిగినవాడు, |
| నిర్వికల్పః | = | నిర్వికల్ప స్వరూపుడై, |
| శుచిః | = | నిర్మలుడై, |
| చ | = | మరియు, |
| శాంతః | = | శాంతుడై, |
| ప్రాప్త అప్రాప్త | = | లభించిన దానిమీదా, లభించని దానిమీదా, |
| వినిర్వృతః | = | విముఖుడై, |
| (భవతి | = | ఉంటాడు). |

**బ్రహ్మ మొదలు గడ్డిపోచ వరకు నేనే అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, నిర్వికల్ప స్వరూపుడై, నిర్మలుడై, శాంతుడై, లభించిన దానిమీదా, లభించని దానిమీదా విముఖుడై ఉంటాడు.**

బ్రహ్మ మొదలు గడ్డిపోచవరకు నేనే అని నిశ్చయజ్ఞానం కలగాలంటే భేదవాసన పోవాలి.

“నేను సాక్షిని, ఇది సాక్ష్యం; ఇది ప్రపంచం, వీరు జీవులు; శిష్యుడు, ఆచార్యుడు, ఈశ్వరుడు మొదలగువారు అను బుద్ధిని ‘భేదవాసన’ అంటారు. ఈ భేదవాసనను ‘అద్వైత అభ్యాసం’తో తొలగించుకోవాలి. (అద్వైతబోధదీపిక 6 - 23)

భేదవాసన పోయి, బ్రహ్మ మొదలు గడ్డిపోచవరకు నేనే అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు నిర్వికల్ప స్వరూపుడై అంటే భేదము లేనివాడై, నిర్మలుడై, శాంతుడై ఉంటాడు.

అద్వైత అభ్యాసంతో భేదవాసనను తొలగించుకున్న వానికి మరో వాసన ఉంది. అది అద్వైతవాసన.

“నేను భేదరహితుడిగా, నిర్మలుడుగా, నిత్యుడుగా (శాశ్వతుడుగా), చిదానందుడుగా, అద్వితీయుడిగా ఉన్నాను” – అని భావించడం ‘అద్వైతవాసన’ అంటారు. (అద్వైతబోధదీపిక 6 - 24)

✸✸✸

**నానాశ్చర్య మిదం విశ్వం న కించిదితి నిశ్చయీ,**
**నిర్వాసనః స్ఫూర్తిమాత్రో న కించి దివశామ్యతి.**

(అష్టావక్రగీత 11-8)

| | | |
|---|---|---|
| నానాశ్చర్య మిదం | = | నానాశ్చర్యం + ఇదం |
| కించిదివ | = | కించిత్ + ఇవ |
| ఇదం | = | ఈ, |
| విశ్వం | = | ప్రపంచం, |
| నానాశ్చర్యం | = | అనేక ఆశ్చర్యాలు కలది, |
| న కించిత్ | = | ఏమీ లేనిది, |
| ఇతి | = | అని, |
| నిశ్చయీ | = | నిశ్చయజ్ఞానం కలిగినవాడు, |
| నిర్వాసనః | = | వాసనలు లేనివాడై, |
| స్ఫూర్తిమాత్రః | = | శుద్ధ చైతన్యస్వరూపుడై, |
| న కించిత్ | = | ఏమీ లేదు, |
| ఇవ | = | అన్న విధంగా, |
| శామ్యతి | = | శాంతంగా ఉంటాడు. |

**ఈ ప్రపంచం అనేక ఆశ్చర్యాలు కలది, ఏమీ లేనిది అని నిశ్చయజ్ఞానం కలిగినవాడు, వాసనలు లేనివాడై, శుద్ధ చైతన్యస్వరూపుడై, ఏమీ లేదు అన్న విధంగా, శాంతంగా ఉంటాడు.**

శంకరాచార్యులవారు శ్రీదక్షిణామూర్తి స్తోత్రంలో మొదటి రెండు శ్లోకములలో ఇలా చెప్పారు:

"ప్రపంచం అద్దంలో కనిపించే నగరంతో సమానమైనది. తనలోనే (ఆత్మలోనే) ఉన్నా, కలలోలాగా, తనలోనే చూస్తున్నా, మాయవల్ల బయట ఉద్భవించినదానివలె అనిపిస్తుంది. జ్ఞానం కలిగినప్పుడు ఎవరు రెండోది లేని తన ఆత్మస్వరూపమునే అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడో అట్టి గురుస్వరూపుడగు శ్రీ దక్షిణామూర్తికి ఈ నమస్కారము."

"ఈ ప్రపంచం సృష్టికి పూర్వం విత్తనం లోపలనున్న మొలకలాగా వికల్పం లేకుండా ఉండేది. సృష్టి సమయంలో మాయచేత కల్పించబడిన దేశ కాల వస్తువులవలన కలిగిన భేదం చిత్రంపబడినది. ఏ పరమాత్మ ఇంద్రజాలికుడిలాగా, మహాయోగిలాగా తన సంకల్పంతోనే ఈ ప్రపంచాన్ని విజృంభింపచేస్తున్నాడో అట్టి గురుస్వరూపుడగు శ్రీ దక్షిణామూర్తికి ఈ నమస్కారము."

ఈ రెండు శ్లోకములు మననం చేసిన వారికి "ఈ ప్రపంచం అనేక ఆశ్చర్యాలు కలది" అన్న నిశ్చయజ్ఞానం కలుగుతుంది.

అజ్ఞానం తొలగి 'బ్రహ్మము సత్యం, జగత్తు మిథ్య' అని తెలుసుకున్నప్పుడు "ఈ ప్రపంచం ఏమీ లేనిది" అన్న నిశ్చయజ్ఞానం కలుగుతుంది.

"అభేదమును గురించి ప్రత్యేకంగా ఆలోచించకుండా ఈ అద్వైతవాసనను కూడా పూర్తిగా వదిలేసి సాధకుడు ఏ వాసనలు లేనివాడై సుఖంగా ఉంటాడు." (అద్వైతబోధదీపిక 6 – 25)

ఈ విధంగా "ఈ ప్రపంచం అనేక ఆశ్చర్యాలు కలది, ఏమీ లేనిది" అన్న నిశ్చయజ్ఞానం కలిగినవాడు వాసనలు లేనివాడై, శుద్ధ చైతన్య స్వరూపుడై, ఏమీ లేదు అన్న విధంగా శాంతంగా ఉంటాడు.

✸✸✸

# అష్టావక్రగీత
## పదకొండవ అధ్యాయం (నిశ్చయజ్ఞానం)

1. ప్రాణులకు భావం (జననం), అభావం (మరణం), వికారాలు (మార్పులు) అన్నీ స్వభావంవల్లనే జరుగుతుంటాయి.

2. ఈశ్వరుడు సర్వనిర్మాణానికి కారణం, ఈ విషయంలో వేరెవ్వరూ లేరు.

3. ఆపదలు, సంపదలు దైవంవలన నిశ్చితకాలంలో మాత్రమే లభిస్తాయి.

4. సుఖదుఃఖాలు, జననమరణాలు దైవంవలన మాత్రమే కలుగుతాయి.

5. ఈ ప్రపంచంలో చింతచేతనే దుఃఖం కలుగుతుంది, వేరే దేని వలనా కాదు.


6. నేను దేహమును కాను, ఈ దేహం నాది కాదు. నేను జ్ఞానస్వరూపుడిని.

7. బ్రహ్మ మొదలు గడ్డిపోచ వరకు నేనే.

8. ఈ ప్రపంచం అనేక ఆశ్చర్యాలు కలది, ఏమీ లేనిది.

***

# భగవాన్ శ్రీరమణమహర్షి



శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు